క్లుప్తంగా

గంగాధరరావుకు పురస్కారం



మధురపూడి: కోరుకొండ మండలంలో విద్యాసంస్థలను నడుపుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పెనకటి గంగాధరరావుకు విశిష్ట సేవా పురస్కారం లభించింది. రాజమహేంద్రవరంలోని ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో గురుబ్రహ్మ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు పురస్కారం అందించారు. గంగాధరరావు కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని గతంలో నిర్వహించారు.

పెద్దాపురం న్యాయస్థానాల పరిధిలోనే ఉంచాలి



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు

రంగంపేట: మండలంలోని అన్ని గ్రామాలను ఎప్పటిలాగే పెద్దాపురం న్యాయస్థానాల పరిధిలోనే ఉంచాలని జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం ఉమ్మడి జిల్లాను ప్రభుత్వం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలుగా విభజించగా, ఇప్పటి వరకూ రంగంపేట మండలం మాత్రం పెద్దాపురం కోర్టుల పరిధిలో ఉందన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత కోర్టుల పరిధి మార్చకుండా మండలాన్ని పెద్దాపురం న్యాయస్థానాల పరిధిలోనే ఉంచాలన్నారు. పెద్దాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెదుల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కందుల నరేష్‌కుమార్, సీనియర్ అడ్వకేట్ సీహెచ్ కనకదుర్గారావు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆహా ఓటీటీ టీమ్ సందడి



విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న సోహైల్

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆహా ఓటీటీ టీమ్ శుక్రవారం సాయంత్రం సందడి చేసింది. ఆహాలో ప్రచారమయ్యే కామెడీ నైట్స్ కార్యక్రమాన్ని విద్యార్థుల సమక్షంలో హాస్యనటుడు ఆర్జే హేమంత్ స్టాండ్ అప్ కామెడీతో ప్రారంభించారు. కొద్దిసేపు అందరినీ హాస్యంతో నవ్వించి, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు పేరడీ చేసి ఆహ్లాదపరిచారు. కార్యక్రమంలో బిగ్‌బాస్ ఫేమ్ సోహైల్, కళాశాల చైర్మన్ ఉపేంద్రరెడ్డి, ఎండీ అనూషరెడ్డి, ప్రిన్సిపాల్ రాజశ్రీ, ఏఓ ఇక్బాల్ పాల్గొన్నారు.

గాస్పల్ టీమ్ సమావేశం

మధురపూడి: బూరుగుపూడిలోని దేవుడి మాన్యం వేగి అబ్రహం చర్చిలో శుక్రవారం దానియేలు ప్రేయర్ అండ్ గాస్పల్ టీమ్ సమావేశం జరిగింది. దీనికి సంస్థ అధ్యక్షుడు టి.ఉషాకుమార్ అధ్యక్షత వహించారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చొప్పున జీవిత బీమా పాలసీలు చేయించారు. కార్యక్రమంలో ఆర్.రాజీవ్ జార్జి, సంస్థ గౌరవాధ్యక్షులు పరదేశి, సెక్రటరీ ఆర్.రాజీకుమార్, ఉపాధ్యక్షులు లాజరస్ పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తికి జైలు

బిక్కవోలు: సారా కేసులో బిక్కవోలుకు చెందిన ఈలి అప్పారావుకు కోర్టు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.2 లక్షలు జరిమానా విధించిందని ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2020 అక్టోబర్ 11న రెండు లీటర్ల సారాతో అప్పారావు పట్టుబడగా అతనికి పైవిధంగా శిక్ష పడిందన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

అనపర్తి: మండల స్థాయిలో నిర్వహించిన ఇస్రో క్విజ్ పోటీల్లో స్థానిక పాతవూరులోని కేపీఆర్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల పదో తరగతి విద్యార్థి కాదా జస్వంత్, ఏఎం కార్తీక్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా ముగ్గురు ఎనిమిదో తరగతి విద్యార్థులు ద్వితీయ స్థానం కైవసం చేసుకుని ఉప విద్యాశాఖాధికారి నారాయణ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

వైద్య సిబ్బంది తీరుపై ధర్నా

గోకవరం: ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ గోకవరం ప్రభుత్వాస్పత్రి ఎదుట శుక్రవారం టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. స్థానిక వెలమపేటకు చెందిన బచ్చు అక్కమ్మ ఇటీవల చికిత్స కోసం ఆస్పత్రిలో చేరింది. 12 రోజుల చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. అనంతరం ఆరోగ్యశ్రీలో చికిత్స చేయించుకున్నట్టు సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ గూర్చి ఆస్పత్రి వైద్యులను అడగ్గా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎస్సై శివనాగబాబు ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

సస్యరక్షణే శ్రీరామరక్ష

- వరిలో సమగ్ర యాజమాన్యంతో దిగుబడులు
- వ్యవసాయాధికారుల సూచనలతో మేలు
- నియోజకవర్గంలో 46,067 ఎకరాల్లో సాగు



పెదపూడిలో తెగుళ్ల నివారణకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పెదపూడి: దేశానికి అన్నం పెట్టేది రైతులే.. వారు సాగులో సిరులు కురిపించాలంటే సస్యరక్షణ చర్యలు అవసరం.. ఖరీఫ్ సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అనపర్తి నియోజకవర్గంలో 46,067 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. అనపర్తి మండలంలో 9,550 ఎకరాలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2,776, బిక్కవోలు మండలంలో 15,741 ఎకరాలు ఉంది. పెదపూడి మండలంలో వరి పంట ప్రస్తుతం పిలకలు, దుబ్బు చేసే దశలో ఉంది. చింతపల్లి, కుమారప్రియం, కరకుదురు తదితర గ్రామాల్లో పొట్టకుళ్లు తెగులు, గంద్రేడు, పుట్టకొండ, పెదపూడి గ్రామాల్లో కాండం తొలుచు తెగులు కనిపిస్తుంది. వాటి నివారణకు పెదపూడి మండల వ్యవసాయశాఖ అధికారి టీవీఆర్ మణిదీప్ పలు అంశాలు తెలియజేశారు. అవి ఇలా..

పొట్టకుళ్లు తెగులు

పొట్టను అంటిపెట్టుకుని ఉన్న ఆకు పైభాగం మీద ప్రథమ లక్షణాలు కనిపిస్తాయి. నిర్దిష్ట ఆకారం లేని మచ్చలు ఏర్పడి, చుట్టూ ముదురు గోధుమ రంగులో ఉండి మధ్యలో బూడిద వర్ణం కలిగి ఉంటుంది. మచ్చలు ఒకదానితో ఒకటి కలసి పొట్టంతా వ్యాపించి వెన్ను బయటకు రాకుండా లోపల కుళ్లిపోతుంది. దీని నివారణకు పంట కాలంలో ఒకసారి సుడోమోనాస్ శిలీంద్రనాశినిని పిచికారీ చేయాలి. సస్యరక్షణకు ప్రోపికోనోజోల్ ఒక మిల్లీలీటరు లేదా కార్బం డైజిమ్ 25 శాతం, మాంకోజెబ్ 50 శాతం మిశ్రమాన్ని రెండు గ్రాములు తీసుకుని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయ అధికారి, పెదపూడి

కాండం తొలుచు పురుగు

ఈ పురుగులు వరి పంటలో పిలకలు పెట్టే దశ నుంచి, చిరుపొట్ట దశ వరకూ ఆశిస్తాయి.

పిలకల దశలో ఆశిస్తే మొవ్వు చనిపోతుంది. దీనిని డెడ్ హర్ట్ అంటారు. చిరుపొట్ట దశలో కంకి బయటకు వచ్చే దశలో ఆశిస్తే గింజలకు పోషక పదార్థాలు అందక తాలు గింజలుగా మారి తెల్లకంకి ఏర్పడుతుంది. దీని నివారణకు నాటడానికి ముందు నారు కొనలు, చివర్లు తుంచి గుడ్ల సముదాయాన్ని నాశనం చేయాలి. లింగాకార్షణ బుట్టలు పెట్టాలి. సాయంత్రం వేళల్లో పొలం గట్లపై మంటలు వేసి తల్లి పురుగులను నాశనం చేయాలి. పొలం గట్లపై పసుపు రంగు పూల మొక్కలు బంతి, చామంతి నాటడంతో తల్లి పురుగులు ఆకర్షించబడి తమ గుడ్లను పూలలో పెట్టడంతో ప్రధాన పొలంలో పురుగు ఉధృతిని గణనీయంగా తగ్గించవచ్చు. పిలకలు పెట్టే దశ నుంచి చిరుపొట్ట దశ వరకూ క్లోరాంత్రనిలిప్రోలు 0.4 శాతం (ఫెర్టారా) గుళికలు ఎకరాకు 4 కిలోల చొప్పున వేసుకోవాలి. తల్లి పురుగు ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాంత్రనిలిప్రోలు 18.5 శాతం (కోరాజిన్) ఎకరాకు 60 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేయాలి.

పాముపొడ తెగులు

వరి మొక్క పిలకలు పెట్టే దశ నుంచి ఎప్పుడైన ఈ తెగులు ఆశించవచ్చు. ఈ శిలీంధ్రం వల్ల ఆకులపై చిన్న గోధుమ రంగు మచ్చలు ఏర్పడి అవి క్రమేపి పెద్దవై పాముపొడ వంటి మచ్చలుగా మారతాయి. తెగులు ముందుగా పొలం గట్లపై ఉన్న కలుపు మొక్కలను ఆశించి క్రమేపి ప్రధాన పొలంలోకి వ్యాపిస్తుంది. నివారణకు విత్తన శుద్ధి విధిగా చేయాలి. నత్రజని ఎరువులను రెండు దఫాలుగా వేయాలి. గడ్డిజాతి కలుపు మొక్కలను తీసి వేసి పొలం గట్లను శుభ్రంగా ఉంచాలి. అజాక్సి స్ట్రోబిన్ 25 ఎస్‌సీ (అమిస్టర్) లీటర్ నీటికి మిల్లీలీటర్ చొప్పున పిచికారీ చేయాలి. లేదా అజాక్సిస్ట్రోబిన్ 11 శాతం, టేబుకొనజోల్ 18.3 ఎస్‌సీ (కస్టోడియా) లీటర్ నీటికి 1.5 మిల్లీలీటరు చొప్పున పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు తెగులు

దుబ్బులో రెండో మూడు పిలకలు వాడిపోయి క్రమేణా పిలకలు మొత్తం ఎండిపోతాయి. తెగులు సోకిన పిలకలలో కణజాలం కుళ్లడంతో పిలకలు మెత్తబడి పైరు నేలపై వాలిపోతుంది. దీని నివారణకు పంట కోత తర్వాత వేసవి సమయంలో లోతు దుక్కులు చేయాలి. పొలంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలి. మూడో పంటగా అపరాలు తప్పక వేయాలి. ఒక పొలంలో నీరు మరో పొలంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తెగులు తరచూ వచ్చే పొలాల్లో నేరుగా విత్తే పద్ధతి అవలంబించాలి. పంట కాలంలో ఒకసారి సూడోమోనాస్ శిలీంద్రనాశిని పిచికారీ చేసుకోవాలి. టేబుకోనాజోల్ (పోలికర్) రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులు సూచించారు.

రోడ్డు పనులు ప్రారంభం



కొంకుదురులో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

బిక్కవోలు: కొంకుదురులో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా రూ.40 లక్షల నిధులు మంజూరు కాగా గ్రామంలో సీసీ రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు పరిశీలించారు.

ఎన్‌సీసీలో ప్రవేశాలకు పరీక్ష



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

రాజానగరం: గైట్ క్యాంపస్‌లోని కళాశాలల విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశానికిగాను శుక్రవారం అర్హత పరీక్షలు జరిగాయి. 18 (ఏ) బెటాలియన్‌కు చెందిన సుబేదార్ భాస్కరరెడ్డి, హవల్దార్ ఖేమ్‌రాజ్ తోపా పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌కి 206 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 35 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో గైట్ ఎన్ఎస్ఎస్ ఏఎన్ఓ ఎ.తేజశ్వరరాజు, ప్రిన్సిపాళ్లు డాక్టర్ పీఎంఎం శర్మ, డాక్టర్ కె.వల్లీమాధవి, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి ముక్తేశ్వరరావు

పెదపూడి: వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ నెల 11 నుంచి నవంబర్ 11 వరకూ నిర్వహించే 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' అనే కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు జయప్రదం చేయాలని అన్నారు. పెదపూడిలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ఈ కార్యక్రమంపై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముక్తేశ్వరరావు మాట్లాడుతూ 2024లో తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించడానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమంలో గ్రామ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. జగన్ ప్రభుత్వంపై ప్రజలు ఎంతమేర సంతృప్తి చెందారో తెలుసుకోవాలన్నారు. ఆ గ్రామంలో తప్పనిసరిగా పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. ఆ రాత్రికి గ్రామంలో బసచేసి సంక్షేమ పథకాలపై ప్రజలతో చర్చించి ప్రభుత్వ పనితీరుపై చెప్పాలన్నారు. ప్రతి కుటుంబానికి కొడుకులా, అన్నగా, పెద్దగా జగన్ మారారన్నారు. పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, మండల జేసీఎస్ కన్వీనర్ కర్రి శ్రీవెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, మండల పరిషత్ విప్ సమ్మంగి దుర్గాప్రసాద్, మండల బీసీ సెల్ కన్వీనర్ పప్పు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకటసుబ్బారెడ్డి అన్నారు. 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమంపై బిక్కవోలులో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. మండల నాయకులు గ్రామాల్లో పల్లె నిద్ర చేయాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలకు వివరించాలని అన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ వసంతం



బిక్కవోలులో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బిక్కవోలులో గడప గడపకూ..

బిక్కవోలు: ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక పథకాలను అమలు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు పథకాలు అందిస్తున్నారన్నారు. 2024లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నాయకులు గువ్వల సత్తిరెడ్డి, యామసాని రవి, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● బిక్కవోలులో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి తెలిపారు. దీనికి వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- కామరాజుపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం



రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కామరాజుపేటలో రూ.21.5 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. స్థానిక దుర్గాకాలనీలో రూ.20 లక్షలతో చేపట్టే ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. స్థానిక దుర్గమ్మ గుడి కాలనీలో శిథిలమైన రోడ్డును బాగు చేయాలంటూ గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో రూ. 20 లక్షలు సమీకరించి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, దాసరి సతీష్‌బాబు, మండల కన్వీనర్ రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్ తేజ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకల్లో ఈ కార్యక్రమం జరిగింది. వారందరికీ ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సీతానగరం ఎంపీపీ గుర్రాల జోత్స్న, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట ఎస్సైగా విజయ్‌కుమార్



రంగంపేట: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా పి.విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకూ రాజమహేంద్రవరంలో వీఆర్‌లో ఉండి తాజాగా రంగంపేటకు వచ్చారు. ఇప్పటి వరకూ రంగంపేట ఎస్సైగా విధులు నిర్వహించిన టి.రామకృష్ణ కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. గురువారం ఆయన రిలీవ్ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని పనిచేస్తానని తెలిపారు.

రంగంపేటలో టీడీపీ కోటకు బీటలు

- అంతర్మథనంలో ఆ పార్టీ శ్రేణులు
- వరుస రాజీనామాలతో క్యాడర్‌లో నిస్తేజం

పెదపూడి: రంగంపేట మండలంలో టీడీపీ కోటలు బద్దలవుతున్నాయి. ఆ పార్టీ శ్రేణులు వరుసగా వారి పదవులకు రాజీనామాలు చేయడంతో క్యాడర్ అందోళనలో పడింది. ఈ నేపథ్యంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెండ్యాల నళినీకాంత్ మధ్య దూరం మరింత పెరుగుతోంది. ఒకప్పుడు రంగంపేట మండలం టీడీపీకి కంచుకోటగా ఉండేది. అప్పటి నేతలు మండలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చక్కదిద్దుకునేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమస్య వస్తే చక్కదిద్దాల్సిన వారే సమస్యగా మారితే పరిస్థితి ఎలా చక్కబడుతుందని అంతా చర్చించుకుంటున్నారు. ఇటీవల పెండ్యాల నళినీకాంత్ ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వద్దకు వ్యక్తిగత పనుల విషయం వెళ్లారని సమాచారం. దీనిని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అదునుగా చేసుకుని నళినీకాంత్ వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేయించారంటూ ఆరోపణలు వచ్చాయి. దీనివల్ల మాజీ ఎమ్మెల్యేకు నళినీకాంత్ వర్గీయులు సహకరించడం లేదని సమాచారం. మరోపక్క నళినీకాంత్‌ను టీడీపీ నుంచి తొలగిస్తున్నట్లు ప్రచారం రావడంతో, ఇదంతా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేయిస్తున్నట్లు నళినీకాంత్ వర్గీయులు చర్చించుకుంటున్నారు. ఇలాంటి పరిణామాల దృష్ట్యా తొమ్మిదేళ్లుగా తెలుగు యువత మండల అధ్యక్షుడిగా ఉన్న యలమాటి రాంబాబు పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వడిశలేరులో మాజీ ఉప సర్పంచ్, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న చావా శ్రీనివాస్, ఇదే గ్రామ తెలుగు యువత అధ్యక్షుడు నూనె వీరవెంకట గంగారామ్, 8వ వార్డు మెంబర్ పాలచర్ల వరప్రసాద్ వార్డు సభ్యత్వానికి, రంగంపేటలో 129వ బూత్ టీడీపీ ఇన్‌చార్జి వుండవిల్లి శివప్రసాద్, పార్టీ క్రియాశీలక సభ్యుడు దేశిన సత్తిబాబు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో రంగంపేట మండలంలో టీడీపీకి గట్టిదెబ్బ తగిలినట్లు అంతా అనుకుంటున్నారు. ఈ విభేదాలు ఇప్పట్లో చల్లారే పరిస్థితి కనిపించడం లేదని ఆ పార్టీ నాయకులే చర్చించుకోవడం విశేషం.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు



కామరాజుపేట జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



పుట్టకొండలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



చంద్రేడు శిబిరంలో వైద్య సేవలను వివరిస్తున్న డాక్టర్

గోకవరం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతిఒక్కరికీ మేలు జరుగుతోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కామరాజుపేటలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కౌంటర్లను సందర్శించారు. పలువురికి ఆరోగ్య కిట్లను అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, దాసరి సతీష్‌బాబు, మండల కన్వీనర్ రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు, ఎంపీటీసీ మద్దూరు బాబ్జి పాల్గొన్నారు.

ఇదో సువర్ణాధ్యాయం

పెదపూడి: మహోన్నత ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ సువర్ణాధ్యాయమని ఎంపీపీ కేతా తులసి అన్నారు. పుట్టకొండలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తూ పల్లెల చెంతకు ఆరోగ్య సేవలు తీసుకు వచ్చిందన్నారు. శిబిరంలో ప్రసూతి వైద్యురాలు సాత్విక 36 మందికి, కంటి వైద్యురాలు రజిత 110, చంటిపిల్లల వైద్యులు రమణ 34, వైద్యులు శిరీష 110, వైద్యులు బి.సురేఖ 156 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్, సర్పంచులు వల్లు వెంకటరమణ, కొల్లు లోవకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి సుంకర వీరస్వామి, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే లక్ష్యం

రంగంపేట: పేదలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు అన్నారు. చంద్రేడులో సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఈ శిబిరంలో రాజమహేంద్రవరం నుంచి డాక్టర్లు రవిచైతన్య, మౌనికారామ్, షమీమ్‌కుమార్, గంగాధర్, ఇందిరా తదితరులు వచ్చి 480 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్, ఎంపీటీసీ కంటిపూడి శేషారత్నం పాల్గొన్నారు.

బిక్కవోలు: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ ఖంగా రామారావు అన్నారు. బలభద్రపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సుమారు 552 మంది రోగులకు పరీక్షలు చేశారు. ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, వైద్యులు విజయలక్ష్మి, దుర్గాదేవి పాల్గొన్నారు.

● పందలపాక సచివాలయం-1 వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం నిర్వహిస్తామని ఈవోపీఆర్డీ బి.భవాని తెలిపారు. ఈ మేరకు వలంటీర్లు, వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించి ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.